సాక్షి
కర్నూలు
శనివారం । 24 । ఆగస్టు । 2024



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళా వేదికపై శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన సురేఖ వారి బృంద సభ్యులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది.



భ్రామరీకి ఊయలసేవ

శ్రీశైలంటెంపుల్: అష్టా దశ శక్తిపీఠంగా వెలసిన శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు.



తిరుచ్చి మహోత్సవం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం రాత్రి తిరుచ్చి మహోత్సవాన్ని నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తిని ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

పని గంటలు తగ్గిస్తే బాగుంటుంది



ప్రభుత్వ ఆసుపత్రిలో కొద్దిమందికి పనిగంటలు అధికంగా ఉంటున్నాయి. ముఖ్యంగా రద్దీగా ఉండే విభాగాలైన క్యాజువాలిటీ, ఏఎంసీ, పీడియాట్రిక్స్, గైనిక్‌లలో పీజీలు అధిక సమయం పనిచేస్తున్నారు. ఇలాంటి సమయంలో ఆయా విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు వారికి సహకారం అందించి డ్యూటీ అసెస్ చేయాలి. అయితే కొన్ని విషయాల్లో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఉంటోంది. అది లేకుండా చూసుకుంటే రోగుల వైపు నుంచి గొడవలు ఉండవు. ఏఎంసీ, క్యాజువాలిటీలలో ఎక్కువసేపు పనిచేస్తారు కాబట్టి అక్కడ వైద్యులకు, సిబ్బందికి రెస్ట్‌రూమ్స్ ఎక్కువ ఏర్పాటు చేయాలి. కొత్త భవనాలు అందుబాటులోకి వస్తే ఈ సమస్య దాదాపు తీరే అవకాశం ఉంది. అత్యవసర విభాగాల్లో సెక్యూరిటీని మరింతగా పెంచాలి. అది కూడా 24 గంటలూ వారు అందుబాటులో ఉండే విధంగా చూడాలి.

–డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, జీజీహెచ్ రిటైర్డ్ సూపరింటెండెంట్, కర్నూలు

భద్రత కల్పించాలి



ప్రతి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మహిళా డాక్టర్లకు భద్రత కల్పించాలి. రాత్రి వేళల్లో ప్రజలకు సేవలందించేందుకు వైద్య సిబ్బంది విధుల్లో ఉంటారు. వారికి తప్పకుండా పోలీస్ ప్రొటెక్షన్ ఇవ్వాలి. కోల్‌కత్తా లాంటి ఘటన జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. డాక్టర్లు నిర్భయంగా విధులు నిర్వహించేందుకు భరోసా ఇవ్వాలి. ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్లు, నర్సులకు కనీస సౌకర్యాలు కల్పించాలి.

– డాక్టర్ రహేలా, పాణ్యం సీహెచ్‌సీ

రాత్రి వేళల్లో మద్యం తాగి వస్తున్నారు



కోల్‌కత్తా వైద్య కళాశాలకు చెందిన వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి అమానుషంగా హతమార్చిన సంఘటన యావత్ దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. అన్ని ఆసుపత్రులలో వైద్యులతో పాటు సిబ్బంది ప్రాణ రక్షణ, భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పోలీస్ ప్రొటెక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ఎంసీహెచ్ విభాగంలో కొందరు వ్యక్తులు రాత్రివేళల్లో మద్యం తాగి వస్తున్నారు. ఇక్కడ సెక్యూరిటీని మరింత పెంచాల్సిన అవసరం ఉంది. ఆసుపత్రిలో పలు విభాగాల్లో రాత్రి వేళల్లో దొంగలు ఎక్కువగా తిరుగుతున్నారు. పోలీసులను కొడితే ఉన్నట్లు వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడి చేస్తే అవే కఠిన చట్టాలు అమలు చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రిలో మొత్తంగా సెక్యూరిటీ అన్ని విభాగాల వద్ద ఉంది. కానీ వారు మరింత నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరముంది.

– డి.మంజులాదేవి, స్టాఫ్‌నర్సు, జీజీహెచ్, కర్నూలు

న్యూస్‌రీల్

జూనియర్ డాక్టర్ల సమ్మె విరమణ



ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె విరమణ పత్రం ఇస్తున్న జూనియర్ డాక్టర్లు

కర్నూలు(హాస్పిటల్): కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ హాస్పిటల్‌లో వైద్య విద్యార్థినిపై హత్యాచారం నేపథ్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత పది రోజులుగా జూనియర్ డాక్టర్లు చేస్తున్న సమ్మె శుక్రవారం విరమించారు. ఈ మేరకు శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డికి పత్రాన్ని అందజేశారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సమ్మె విరమిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వెంటనే అత్యవసర విధుల్లో చేరినట్లు తెలిపారు. సాధారణ వైద్యసేవల్లోనూ పాల్గొంటున్నట్లు వివరించారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జూనియర్ వైద్యులకు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు.

11 మండలాల్లో జల్లులు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని వర్షాలు తగ్గుముఖం పట్టాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు 11 మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా సగటున 2.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.2 మిమీ ఉండగా.. ఇప్పటి వరకు 159.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షాలు తెరిపివ్వడంతో పొలాల్లో అంతరకృషి వంటి పనులకు అవకాశం ఏర్పడింది.

సెప్టెంబర్ 11 నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్

కర్నూలు(సెంట్రల్): ఆన్‌లైన్ ద్వారా ఇసుక బుకింగ్ చేసేందుకు సెప్టెంబర్ 11 నుంచి చర్యలు తీసుకోవాలని మైన్స్ అండ్ ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్‌కుమార్‌మీనా కలెక్టర్‌ను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉచిత ఇసుక విధానంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందుగా ఇసుక బుకింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముందుగా వచ్చిన వారికి టోకెన్‌లు ఇవ్వాలన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జేసీ నవ్యతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

అందని విద్యాకానుక కిట్లు

- ఆగ్రహం వ్యక్తం చేసిన డీఈఓ

కోసిగి: విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడిచిపోతున్నా విద్యా కానుక కిట్లు విద్యార్థులకు అందకపోవడంపై జిల్లా విద్యాధికారి శామ్యూల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంకాలం కోసిగిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు రాలేదని, షూస్ సరిపోవడం లేదని ఫిర్యాదు చేయడంతో డీఈఓ హాస్టల్ సిబ్బందిపై మండిపడ్డారు. వెంటనే విద్యా కానుక కిట్లు అందించాలని ఎంఈఓ-1 మెయినుద్దీన్‌కు ఆదేశించారు.

నేడు ప్రిన్సిపాళ్ల సమావేశం

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో శనివారం ఉదయం 11 గంటలకు వర్సిటీలోని న్యూ లైబ్రరీ బిల్డింగ్ మీటింగ్ హాల్‌లో సమావేశం నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రిన్సిపాళ్లతో పాటు ఒక టెక్నికల్ పర్సన్‌ను సైతం హాజరు కావాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఏ ఏఆర్ఐడీపై మార్గదర్శనం చేయనున్నట్లు తెలిపారు.

పైసలిస్తేనే పవర్ కనెక్షన్!

- ఎస్టిమేట్లు వేయడానికి, లైన్ లాగడానికి మామూళ్లు తప్పనిసరి
- వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌కు లంచం ఇవ్వాల్సిందే
- ప్రతి రైతుపై రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు అదనపు భారం
- జిల్లాలో 10,400 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల పెండింగ్

➤ బోరులో నీరు ఉండటంతో పత్తికొండ మండలం దేవనకొండకు చెందిన ఓ రైతు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. ఎస్టిమేట్లు వేసే సమయంలోనే విద్యుత్ అధికారులు ఈ రైతు నుంచి మామూళ్ల రూపంలో రూ. 5 వేల వరకు వసూలు చేశారు. కనెక్షన్ వచ్చే సమయానికి ఇంకా ఎంత ఇవ్వాల్సి వస్తుందోనని ఈ రైతు ఆందోళన చెందుతున్నాడు.

➤ కోడుమూరుకు చెందిన ఓ రైతుకు విద్యుత్ కనెక్షన్ మంజూరైంది. మామూళ్ల రూపంలో రూ. 50 వేలు ఖర్చు అయినా ఇప్పటి వరకు కనెక్షన్ ఇవ్వలేదు. నీరు ఉన్నా.. విద్యుత్ కనెక్షన్ రాక.. పంటలు కాపాడుకోలేక ఆ రైతు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తన సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవస్థ పడుతున్నారు.



కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ శాఖలో కొందరు ఉద్యోగులు కాసులకు కక్కుర్తి పడుతున్నారు. చేయి తడిపినవారికే విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల కోడ్ రావడంతో మార్చి 18 నుంచి వ్యవసాయ, పారిశ్రామిక కనెక్షన్లు ఇవ్వడానికి ఎస్టిమేట్లు వేయడం, డిమాండ్ నోటీసులు ఇవ్వడం, కనెక్షన్‌లు విడుదల చేయడం వంటి ప్రక్రియ ఆగిపోయింది. జూన్ నెల చివరి వారం నుంచి కొత్త కనెక్షన్‌లు ఇచ్చేందుకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం, ఎస్టిమేట్లు వేయడం, డిమాండ్ నోటీసులు ఇవ్వడం, రైతులు చెల్లించాల్సిన మొత్తానికి డీడీలు కట్టించుకోవడం వంటి వాటికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కనెక్షన్ ఇప్పటికి వరకు ఇవ్వకపోయినప్పటికీ ఎస్టిమేట్లు వేయడం, డిమాండ్ నోటీసులు ఇవ్వడం వంటి ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

మామూళ్లు ఇస్తేనే ఎస్టిమేట్లు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కోసం రైతులు మీసేవ కేంద్రాలు, గ్రామ సచివాలయాల్లో ముమ్మరంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 13,500 మంది వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ముందుగా విద్యుత్ అధికారులు వెళ్లి బోరు పాయింట్ నుంచి విద్యుత్ పోల్ ఉన్న ప్రాంతం వరకు ఎన్ని పోల్స్ పడతాయి.. ట్రాన్స్‌ఫార్మర్లు ఎన్ని అవసరం అవుతాయి.. ఎంతదూరం లైన్ వేయాలి.. కేబుల్ ఎంత ఉండాలి.. తదితర విషయాలపై పూర్తి స్థాయిలో ఎస్టిమేట్లు వేయాలి. ఎస్టిమేట్లు వేయడానికి వేలాది రూపాయల ముడుపులు సమర్పించుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం విద్యుత్ సిబ్బందికి ప్రత్యేకంగా వాహనం, విందు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఎస్టిమేట్లు తయారు చేసిన తర్వాత డిమాండ్ నోటీసు జనరేట్ చేస్తారు. డిమాండ్ నోటీసులో పేర్కొన్న ప్రకారం రైతు వాటా మొత్తాన్ని డీడీ చెల్లించాల్సి ఉంది. ఎస్టిమేట్ అమౌంటును బట్టి శాంక్షనింగ్ అథారిటీ మారుతుంది. మండల స్థాయిలోనే మంజూరు అయితే ఒక రేటు, సబ్ డివిజన్ స్థాయిలో మంజూరు అయితే ఇంకో రేటు, డివిజన్ స్థాయిలో మంజూరు అయితే మరో రేటు ఉంటుంది.

లైన్ వేయించుకోవాలంటే చుక్కలే!

ఎస్టిమేట్లు వేయించుకోవడం ఒక ఎత్తు అయితే లైన్ వేయించుకోవడం మరో ఎత్తుగా మారింది. డిమాండ్ నోటీసుకు అనుగుణంగా రైతులు తమ వాటా మొత్తాన్ని చెల్లించిన తర్వాత పోల్స్ సరఫరా చేస్తారు. పోల్స్ రావాలన్నా ముడుపులు ఇచ్చుకోవాల్సిందే. పోల్స్ వచ్చిన తర్వాత ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్, కండక్టర్ విద్యుత్ శాఖ స్టోర్ నుంచి డ్రా చేస్తారు. అయితే రైతుకు ఇవ్వరు. మళ్లీ ముడుపులు ముడితేనే పోల్స్ పాతి, లైన్ వేస్తారు. విద్యుత్ లైన్ నుంచి బోరు పాయింటు దగ్గరకు లైన్ వేయడానికి 180 మీటర్ల వరకు ప్రభుత్వం భరిస్తుంది. 11 కేవీ లైన్ వేస్తే 180 మీటర్లకు దాదాపు రూ.60 వేలు, ఎల్‌టీ(లోటెన్షన్) లైన్ వేస్తే రూ.45 వేలు వరకు ఖర్చు వస్తుంది. అవసరాన్ని బట్టి 11 కేవీ లేదా ఎల్‌టీ లైన్ వేస్తారు. 180 మీటర్లు దాటితే ఆ ఖర్చు రైతు భరించాల్సి ఉంది. లైన్ దూరాన్ని, ఎస్టిమేట్ మొత్తాన్ని బట్టి మామూళ్లు ఇవ్వాల్సి ఉంటుంది. లైన్ వేయాలంటే కనీసం రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఇచ్చుకోవాల్సిందే.

తప్పని ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు నెలలు దాటింది. ఇప్పటి వరకు కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇవ్వలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 10,400 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్టిమేట్ల ప్రకారం రైతు వాటా మొత్తం చెల్లించి కూడా కనెక్షన్ల కోసం నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది.

రైతులపై మామూళ్ల భారం

విద్యుత్ కనెక్షన్ పొందాలంటే ఒక్కో రైతు సగటున రూ.50 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు మామూళ్లు సమర్పించాల్సి వస్తోంది. పనులు వేగంగా జరగాలంటే ముడుపుల రేటు ఎక్కువగా ఉంటుంది. అడిగినంత డబ్బులు ఇస్తే సీనియారిటీ వంటివి ఏమీ ఉండవు. ఈ పరిస్థితి పరిశ్రమ కనెక్షన్‌లు ఇచ్చేందుకు కూడా ఉండటం గమనార్హం. నీళ్లు ఉన్నాయి.. ఏదో విధంగా కరంటు కనెక్షన్ తీసుకుంటే పంటలు పండించుకోవచ్చనే ఆశతో కొందరు రైతులు అడిగిన మేరకు మామూళ్లు ఇస్తున్నారు. రైతుల అవసరాలను విద్యుత్ శాఖ ఉద్యోగులు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పొందేందుకు రైతులు ఎవ్వరికీ మామూళ్లు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎస్టిమేట్లు వేయడానికి, లైన్‌లు లాగడానికి డబ్బులు అడిగితే సంబంధిత రైతులు అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు. రైతుల నుంచి విద్యుత్ సిబ్బంది డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి షెడ్యూలు ప్రకారం అన్ని పనులు జరగాలి.

– ఉమాపతి, ఎస్ఈ, విద్యుత్ శాఖ

తూతూమంత్రంగా గ్రామ సభలు

- పలు చోట్ల సర్పంచ్‌లు లేకుండానే నిర్వహణ



సి.బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డిలో సర్పంచ్ లేకుండానే గ్రామ సభను నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో శుక్రవారం గ్రామసభలు తూతూమంత్రంగా సాగాయి. కూటమి నేతల సిఫార్సులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం నిధులతో సీసీరోడ్లు, డ్రైన్స్, పశువులు, గొర్రెలు, కోళ్ల షెడ్ల పనులకు ఆమోదం తెలిపారు. గ్రామసభలను సర్పంచ్‌లు కాకుండా అధికారులు అధ్యక్షత వహించడం వివాదాస్పద మైంది. సి. బెళగల్ మండలం బ్రాహ్మణదొడ్డిలో సర్పంచ్ లేకుండానే గ్రామ సభ నిర్వహించారు. కంబదహాల్ గ్రామ సభలో సర్పంచ్‌ను వెనుకలైన్‌లో కూర్చబెట్టి సభను నిర్వహించారు. కర్నూలు మండలం గార్గేయపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, డ్వామా పీడీ అమరనాథరెడ్డి, జెడ్పీ సీఈవో నాసరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రతి పంచాయతీలో సగటున రూ.50 లక్షల నుంచి రూ.2 కోట్ల విలువ పనులకు గ్రామసభలు ఆమోదం తెలిపాయి. కర్నూలు జిల్లాలో రూ.550 కోట్లకు, నంద్యాల జిల్లాలో రూ. 750 కోట్లకు.. మొత్తం రూ.1300 కోట్ల పనులకు గ్రామసభలు ఆమోదం తీసుకున్నట్లుగా అధికార వర్గాలు తెలిపాయి.

ప్రత్యామ్నాయ విత్తన ధరలు ఖరారు

కర్నూలు(అగ్రికల్చర్): ప్రత్యామ్నాయ పంటల సాగుకు విత్తన ధరలు ఖరారైనట్లు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు 1,580 క్వింటాళ్ల విత్తనాలను ప్రభుత్వం కేటాయించిందని, వాటిలో జొన్న 863, సజ్జ 82, కొర్ర 260, ఉలవలు 375 క్వింటాళ్లు ఉన్నాయని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. కొర్ర విత్తనాలు కిలో ధర రూ.87.40 ఉండగా.. సబ్సిడీ రూ.66.92 పోను రైతులు రూ.20.48 చెల్లించాల్సి ఉందన్నారు. జొన్నలు 3 కిలోల ప్యాకెట్ ధర రూ.700 ఉండగా.. సబ్సిడీ రూ.560 పోను రైతులు రూ.140 చెల్లించాల్సి ఉందని తెలిపారు. సజ్జలు కిలోన్నర ప్యాకెట్ ధర రూ.370 ఉండగా.. సబ్సిడీ రూ.296 పోను రైతులు రూ.74 చెల్లించాలని సూచించారు.

నిబంధనల మేర పార్టీ కార్యాలయ నిర్మాణం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ



కర్నూలు (టౌన్): నిబంధనల మేరకే కర్నూలులో వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నామని, అందుకే కార్యాలయ కూల్చివేత ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ తెలిపారు. కర్నూలులో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కర్నూలు నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి సంబంధించి 90 శాతం పైగా పనులు పూర్తయ్యాయన్నారు. భవనాన్ని కూల్చివేయాలంటూ కర్నూలు కార్పొరేషన్ కార్యాలయ అధికారులు ఈనెల 7వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించడంతో కూల్చివేత ఉత్తర్వులు రద్దు చేసిందన్నారు. అలాగే భవన నిర్మాణానికి సంబంధించిన వివరాలు, అదనపు డాక్యుమెంట్లు పరిశీలించి ఎనిమిది వారాల వ్యవధిలో తగు నిర్ణయం తీసుకోవాలని సూచించిందన్నారు. గతంలోనే భవనానికి సంబంధించిన డాక్యుమెంట్లు, అనుమతులు, నిర్ణయించిన భవన ఫీజులు ప్రభుత్వానికి సమర్పించినట్లు చెప్పారు. అయినా వీటిన్నంటినీ పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా కూల్చివేతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్సాహం చూపడం తగదన్నారు. ప్రతి అభ్యంతరానికి సమాధానాలు ఇచ్చామని, న్యాయస్థానాలు ఉన్నాయన్న సంగతి ప్రస్తుత ప్రభుత్వం మరిచిపోయినట్లు ఉందన్నారు.

అశ్వవాహనంపై భక్తవత్సలుడు

- వైభవంగా రాఘవేంద్ర స్వామి ఆరాధన వేడుకలు



సంస్థాన పూజలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు



అశ్వ వాహనంపై ప్రహ్లాదరాయలు

మంత్రాలయం: శ్రీరాఘవేంద్రస్వామి 353వ ఆరాధన సప్తరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల నేతృత్వంలో శుక్రవారం ఆరో రోజు వేకువ జామున 5.30 గంటలకు సుప్రభాత సేవతో వేడుకలు ప్రారంభమయ్యాయి. రాఘవేంద్రుల మూల బృందావనానికి విశేష పూజలు, రాయరు పాదపూజ, మూలదేవర సంస్థాన పూజ, శ్రీరాఘవేంద్రస్వామి మఠం 13వ పీఠాధిపతి సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధనలు కనుల పండువగా సాగాయి. మంగళ వాయిద్యాలు, దాస సాహిత్య మండలి మహిళల భజనలు, అశేష భక్త జనం హర్ష ధ్వానాలు మధ్య ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు అశ్వ వాహనంపై శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో వైభంగా ఊరేగారు. అనంతరం చెక్క, వెండి, అంబారి, స్వర్ణ రథాలపై ఉత్సవమూర్తికి రథయాత్రలు నిరన్వహించారు. వేడుకల్లో మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్-1 శ్రీనివాసరావు, మేనేజర్-2 వెంకటేష్‌జోషి, మేనేజర్-3 శ్రీపతి ఆచార్, పీఆర్వో ఐపీ నరసింహామూర్తి, ధార్మిక సహాయకాధికారి వ్యాసరాజాచార్, ద్వారపాలక అనంతస్వామి, ఏపీఆర్‌ఓ బిందుస్వామి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

యోగీంద్ర సభా మంటపంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. భవాని నాట్యాలయ (చెన్నై) బృందం భరతనాట్యం, విధూషి ఆశిక, హరిహరణ్ తండా (బెంగళూరు) కథక్, భరతనాట్య ప్రదర్శనలు అలరించాయి. పండిట్ కృష్ణేంద్ర వాడికర్ (హుబ్లీ) హిందూస్థానీ సంగీత కచేరి వీనుల విందు చేసింది.

నేటి కార్యక్రమాలు ..

ఉత్సవాల్లో భాగంగా శనివారం సర్వ సమర్పణోత్సవం జరుగనుంది. ఏక కాలంలో పంచవాహనాలపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు, రాఘవేంద్రులను శ్రీమఠం ప్రాంగణ వీధుల్లో ఊరేగించనున్నారు.

పేరుకే ఉచితం.. ధర మరింత ప్రియం

- సామాన్యుడికి భారంగా మారిన ఇసుక
- ట్రాక్టర్, లారీ బాడుగలను నిర్ణయించిన ప్రభుత్వం
- ఇసుక ట్రాక్టర్ ఇంటికీ రావాలంటే రూ.2,803 చెల్లించాల్సిందే
- టిప్పర్ అయితే రూ.9,468 ఇవ్వాల్సిందే
- 20 కిలోమీటర్ల పరిధి దాటినే అదనంగా చెల్లించుకోవాల్సిందే



గుడికంబాళిలో ఇసుకను టిప్పర్‌లో వేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక అంటూనే టన్నుల ప్రకారం అమ్ముతోంది. ఇదేమంటే నదిలో ఉండే ఇసుక మాత్రమే ఉచితమని..నది నుంచి బయటకు తీసేందుకు ఖర్చు వస్తోందని చెబుతోంది. కొనుగోలు చేసిన ఇసుకనే ఇళ్లు, భవనాలు, ఇతర నిర్మాణాలకు వాడుకోవాలని సూచిస్తోంది. ప్రజలు ఒకవైపు ఇసుకను టన్నుల ప్రకారం కొనుగోలు చేసి, మరోవైపు ప్రభుత్వం నిర్ణయించిన రేట్లలో వాహనాల ద్వారా రవాణా చేసుకోవాల్సి వస్తోంది. దీంతో భవన నిర్మాణ యజమానులపై భారం పడుతోంది.

ఖర్చు.. తడిసి మోపెడు

రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుకపై మరో డ్రామాకు తెరతీసింది. గతంలో టన్ను రూ.335 ఉండగా.. దానిని రూ.326 తగ్గించి.. ఇదే సమయంలో ఇసుకను రవాణా చేసే ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల రేట్లను కూడా నిర్ణయించారు. 20 కిలోమీటర్ల వరకు ట్రాక్టరు, లారీల బాడుగలు ఎంత ఉండాలి? తరువాత అదనంగా వచ్చే కిలోమీటర్లకు ఎంత వసూలు చేయాలనే దానిపై నిర్ణయం తీసుకున్నారు. ట్రాక్టర్ ఇసుక రవాణా కోసం వినియోగదారుడు రూ. 1,400 చెల్లించాల్సి ఉంటుంది. పది టైర్ల లారీ ఇసుక కోసం రూ. 2,000, అలాగే 18 టైర్ల లారీ ఇసుక రవాణా కోసం రూ.3600, 12 టైర్ల లారీ ఇసుక కోసం రూ.3840, 16 టైర్ల లారీ కోసం రూ.4,480 చెల్లించాల్సి ఉంది. ఈ క్రమంలో ఇసుక ఖర్చుతో కలుపుకుంటే వినియోగదారులకు తడిసి మోపెడు కానుంది. 20 కిలోమీటర్ల పరిధి దాటితే ఆపై ప్రతి కిలోమీటర్‌కు రూ.8 చొప్పున అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. భవన నిర్మాణ దారులకు ఇసుక కొనుగోలు తీవ్ర భారం కానున్నది.

ఇసుక, రవాణా ఖర్చులు కలిపి పలికే ధరల వివరాలు..

వావానం పేరు	ఇసుక టన్నుల్లో..	ఇసుక ధర	20 కిలోమీటర్ల వరకు ధర	ఇసుక+రవాణా ఖర్చు
ట్రాక్టర్	4.5	1,467	1,400	2,867
6 టైర్ల లారీ	10	3,260	2,000	5,868
10 టైర్ల లారీ	18	5,868	3,600	9,468
12 టైర్ల లారీ	22	7,172	3,840	11,012
16 టైర్ల లారీ	31	4,480	10,106	14,586

అందుబాటులోకి ఐదు డిసిల్టింగ్ పాయింట్లు...

ప్రస్తుతం కర్నూలు, నంద్యాల జిల్లాలకు కలిపి కౌతాళం మండలం గుడికంబాళిలో మాత్రమే ఇసుక రీచ్ అందుబాటులో ఉంది. అందులో కూడా కేవలం 5 వేల టన్నుల ఇసుక మాత్రమే లభ్యతగా ఉంది. ఈక్రమంలో సీబెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, ఈర్లదిన్నె, గుడుమాల, పల్లెదొడ్డిలలో ఉండే డిసిల్టింగ్ పాయింట్లకు పర్యావరణ అనుమతులు వచ్చాయి. వీటిలో కూడా శుక్రవారం నుంచి ఇసుక వినియోగదారులకు అందుబాటులో ఉంటోంది. కౌతాళ మండలం గుడికంబాళి, నదిచాగి, మరళి గ్రామాల పరిధిలోనూ మూడు డిసిల్టింగ్ పాయింట్లను త్వరలోనే అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే ప్రస్తుతం ఈ మూడు పాయింట్లపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ జరుగుతోంది. త్వరలోనే వీటికి పర్యావరణ అనుమతులు మంజూరయ్యే అవకాశం ఉంది.

ఇసుకను ఉచితంగా ఇవ్వాలి



ప్రభుత్వం ముందుగా ఇచ్చిన హామీ ప్రకారం ఇసుకను ఉచితంగా ఇవ్వాలి. ఎవరికీ వారే ఇసుక కోసం వెళ్తే తీసుకొచ్చుకునేలా ఉండాలి. ధరలు నిర్ణయించి ఉచిత ఇసుక అంటే ఎలా? ప్రభుత్వం నిర్ణయించిన రవాణా చార్జీలను కూడా తగ్గించాలి. ఉచిత ఇసుక పాలసీతో పనులు లేకుండా కార్మికులు పస్తులు ఉంటున్నారు.

– చంద్రశేఖర్, ఏఐటీయూసీ నగర కార్యదర్శి

క్లుప్తంగా

30న డిఫెన్స్ పెన్షన్ ఔట్రీచ్

కర్నూలు(అర్బన్): బీ క్యాంప్‌లోని టీజీ వెంకటేష్ కల్యాణ మండపంలో ఈ నెల 30వ తేదీన డిఫెన్స్ పెన్షన్ ఔట్రీచ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్నరూత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మిలిటరీ సర్వీస్ పెన్షనర్లు, డిఫెన్స్ సివిలీయన్ పెన్షనర్లు,ఫ్యామిలీ పెన్షనర్లకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించి పరిష్కరిస్తారని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే కర్నూలు,నంద్యాల జిల్లాలకు చెందిన మిలిటరీ సర్వీస్ పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్ 08518–229445, సెల్: 8688817886 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మూడు ఎర్రమట్టి టిప్పర్ల సీజ్

కర్నూలు (టౌన్): ఎలాంటి లీజు అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఎర్రమట్టి కొల్లగొడుతున్న వారిపై గనుల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామంలోని ఎర్రకొండ నుంచి ఎర్రమట్టి తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేసి ఓర్వకల్ పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు గనుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ తెలిపారు. ఎర్రమట్టిని ఓర్వకల్లు విమానాశ్రయం వద్ద ఏపీఐఐసీ (ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ) ఆధ్వర్యంలో చేపడుతున్న రహదారి పనుల నిమిత్తం తరలిస్తున్నట్లు తమ విచారణలో తేలిందన్నారు.పనులు చేస్తున్న సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తున్నట్లు చెప్పారు.

త్వరలో ఆర్థిక భవనం పూర్తి



ట్రెజరీ అధికారులతో మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి

కర్నూలు (అగ్రికల్చర్) : కర్నూలు నగరంలో సమీకృత ఆర్థిక భవనం త్వరలో పూర్తవుతుందని ఏపీఈడబ్ల్యుఐడీసీ చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన బీ క్యాంప్‌లో నిర్మించిన ఫైనాన్స్ బిల్డింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ అధికారి జయలక్ష్మి, పరిపాలన ఎస్టీవో సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఫైనాన్స్ బిల్డింగ్‌లో పలు పెండింగ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని, ఈ పనులు పూర్తి చేస్తే కర్నూలులోని ఆర్థిక శాఖకు సంబంధించిన అన్ని విభాగాలు ఫైనాన్స్ బిల్డింగ్‌లోకి రావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. త్వరగా అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరారు. చీఫ్ ఇంజనీర్ నరసింహమూర్తి స్పందిస్తూ అతి త్వరలోనే మిగిలిపోయిన అన్ని పనులను పూర్తి చేస్తామని, కొత్త బిల్డింగ్‌లోకి రావడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యుఐడీసీ డీఈ నాగరాజు, ట్రెజరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి



సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేస్తే మెడికల్ రంగంలో సేవలు అందించే ఉద్యోగినులకు మరింత భద్రత లభిస్తుంది. ఈ యాక్టు అమలు చేస్తే డ్యూటీలో ఉన్న వైద్య, సిబ్బందిపై దాడులు జరిగితే ఫిర్యాదు చేసిన ఆరు గంటల వ్యవధిలో నిందితులపై చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. దీనివల్ల డాక్టర్లపై ఎవరైనా దాడులు చేయాలంటే భయపడతారు. ప్రాణాలు కాపాడే వైద్యసిబ్బందికి ప్రతి ఒక్కరూ రక్షణగా నిలవాలి.

– డాక్టర్ యమున, ఉప్పలపాడు పీహెచ్‌సీ, అవుకు మండలం

కోల్‌కతా ఘటన అమానుషం



ప్రజల ప్రాణాలను కాపాడే డాక్టర్ల ప్రాణాలకే రక్షణ లేకుండా పోతోంది. కోల్‌కతా ఘటన అమానుషం. నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలి. మహిళా డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది రాత్రి పూట విధులు నిర్వర్తించే సమయంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలి. ప్రధానంగా ఆస్పత్రి ప్రాంగణంలోకి మద్యం మత్తులో ఉండేవారిని, ఇతరులను అనుమతించకుండా సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలి.

– వై. ప్రదీప్, వైద్యాధికారి, కృష్ణగిరి

వంద శాతం భరోసా కల్పించాలి



ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అందించే మహిళా సిబ్బందికి వంద శాతం భరోసా కల్పించాలి. విధి నిర్వహణలో రోగుల నుంచి ఎదురయ్యే ఇబ్బందులు, అవాంఛనీయ ఘటనలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలి. పని చేసే చోట మహిళపై అకృత్యాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మహిళలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా పరిగణించి కఠినమైన శిక్షలు అమలు చేయాల్సిన అవసరం ఉంది.

– ఓబులమ్మ, నర్సు, బేతంచెర్ల

‘ఆభా’తో ఎక్కడైనా వైద్యం

- జిల్లాలో ఆభా రిజిస్ట్రేషన్ పూర్తి
- ఆన్‌లైన్‌లో వ్యక్తి ఆరోగ్య సమాచారం
- గత ప్రభుత్వంలో నమోదు పూర్తి
- ఈ ప్రభుత్వంలో ఇంకా పూర్తికాని మూడో విడత

కర్నూలు(హాస్పిటల్): వ్యక్తి తనకున్న వ్యాధి లక్షణాలు చెప్పగలిగితేనే ఏ డాక్టరైనా వెంటనే వైద్యం చేయగలరు. లేకపోతే వైద్య పరీక్షలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఇది ఖర్చుతో కూడుకున్న పని. అలాగే సమాజంలోని ప్రజల ఆరోగ్య వివరాలు సవివరంగా తెలియకపోతే ప్రభుత్వం తగిన వైద్య సేవలు, మందులు, పౌష్టికాహారం వంటివి అందించలేదు. దీన్ని నివారించేందుకు సమాజంలో ప్రజల ఆరోగ్య వివరాలు ప్రభుత్వానికి తెలిసి ఉండాలి. తద్వారా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టి వ్యాధి నివారణ చేయగలగుతుంది. ఇందుకోసం ప్రజల ఆరోగ్య సమాచారం నమోదు చేసుకుని ఆయుష్మాన్ భారత్ (ఆభా) కార్డులను జారీ చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం వివరాలన్నీ ఆన్‌లైన్ చేస్తోంది.

ఆయుష్మాన్ భారత్ (ఆభా) పేరిట ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించి కేంద్రప్రభుత్వం ఆభా కార్డులు జారీ చేస్తుంది. ఇందులో వ్యక్తికి ఫోన్ నంబర్‌తో లింక్ ఉన్న ఒక నంబర్ ఉంటుంది. దాని ఆధారంగా ఎక్కడైనా ఆభా కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ కార్యక్రమాన్ని గత ప్రభుత్వంలో ముమ్మరంగా నిర్వహించారు. జిల్లాలో దాదాపు 87 శాతానికి పైగా ప్రజలకు ఆభా కార్డు జారీ ప్రక్రియ పూర్తి చేశారు. ఒక్కసారి రోగి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై కార్డు పొందితే చాలు దేశంలో ఎక్కడైనా, ఏ ఆసుపత్రిలోనైనా వైద్యం చేయించుకునేందుకు సులభం అవుతుంది. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర ఆరోగ్య సమస్యలున్న వారు వేరే ప్రాంతానికి వెళ్లినప్పుడు ఆరోగ్య సమస్యలు ఎదురైతే వెంటనే చికిత్స అందించేందుకు ఈ కార్డు ఎంతో ఉపయోగపడుతుంది.



హెల్త్ ఐడీ కార్డు నమూనా

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో అమలు

ఆభా కార్డు/వివరాల ఆధారంగా కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చికిత్స ప్రారంభించారు. ఈ మేరకు ఓపీ ఇవ్వాలంటే క్యూ ఆర్ కోడ్ పద్ధతిని అమలు చేస్తున్నారు. ఓపీ కోసం వెళ్లిన రోగి ఆధార్ నెంబర్ లేదా ఫోన్ నెంబర్ చెబితే వైద్య సిబ్బంది వారి ఫోన్‌లో వివరాలు నమోదు చేసి ఒక నంబర్ ఇస్తారు. ఆ నంబర్‌ను ఓపీ కౌంటర్ వద్ద చూపితే ఎలాంటి వివరాలు అడగకుండా, కేవలం ఎక్కడికి వెళ్లాలనే వివరం తీసుకుని ఓపీ ఇస్తున్నారు.

ఆభా కార్డుతో ఉపయోగాలు

ఆభా కార్డు ద్వారా దేశంలో ఏ ఆసుపత్రికి వెళ్లినా 14 అంకెల ఐడీ నంబర్ ఎంటర్ చేయగానే వ్యక్తి మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది, తద్వారా వ్యక్తి అనుమతితో ఆన్‌లైన్‌లో నమోదైన ఆరోగ్య వివరాలను వైద్యులు తెలుసుకుని చికిత్స అందిస్తారు. మొబైల్ ఫోన్ లేకపోతే నేరుగా బయోమెట్రిక్(వేలిముద్ర) వేస్తే ఆన్‌లైన్‌లో వివరాలు వెల్లడవుతాయి. ఆన్‌లైన్‌లో రోగి పేరు, ఊరు, అతని ఆరోగ్య వివరాలు, గతంలో చికిత్స అందుకున్న వివరాలు, చేయించుకున్న వైద్యపరీక్షల వివరాలు ఉంటాయి. వీటన్నింటినీ విశ్లేషించి వైద్యులు చికిత్స అందించేందుకు సులభం అవుతుంది. ఆభా కార్డు ఉంటే రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుంది.

ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని అన్ని టీచింగ్ హాస్పిటల్స్‌లో దీన్ని అమలు చేస్తున్నారు. డిజిటల్ పద్ధతిలో ఓపీ ఇచ్చి వివరాలు నమోదు చేసినందుకు గాను ఒక్కో ఓపీకి రూ.2 చొప్పున కేంద్ర ప్రభుత్వం ఆసుపత్రికి అందజేస్తుంది. ఈ ప్రకారం నెలకు ఆసుపత్రి ఖజానాకు రూ.1.50 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు అందుతుంది.

భవిష్యత్‌లో అంతా ఆన్‌లైన్ విధానమే!

ప్రస్తుతం ఆసుపత్రుల్లో చికిత్స వివరాలను కాగితాలపై రాస్తున్నారు. రిపోర్టులు కూడా కాగితాలపైనే వస్తున్నాయి. భవిష్యత్‌లో అన్నీ డిజిటల్ కానున్నాయి. మీకు కేటాయించిన ఐడీ నంబర్‌ను వారికి చెబితే చాలు ఆన్‌లైన్‌లో నమోదైన ఆరోగ్య సమాచారం ఆధారంగా చికిత్స అందిస్తారు. మందులు అవసరమైతే ఫార్మసీకి, అడ్మిషన్ అవసరమైతే ఫలానా విభాగానికి నేరుగా ఆభా కార్డు చూపితే చాలు అవసరమైన వైద్య సేవలు అందిస్తారు. ఈ మేరకు అన్ని విభాగాలకు కంప్యూటర్లు కూడా మంజూరయ్యాయి. ఈలోగా ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియ ఆగిపోయింది. మళ్లీ ఇందుకు సంబంధించిన ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని పరిస్థితి.

ఎన్నో ఉపయోగాలు



ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఐడీ (ఆభా) జారీ ప్రక్రియ జిల్లాలో ఆరు నెలల క్రితమే దాదాపుగా పూర్తి చేశాం. ఈ కార్డుతో వైద్యం చేసే విధంగా ఇప్పటికే పలు ఆసుపత్రుల్లో చర్యలు ప్రారంభమయ్యాయి. ప్రతి వ్యక్తికి ఇచ్చిన హెల్త్ ఐడీ నంబర్ ఆధారంగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని చికిత్స అందించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులన్నీ సిద్ధం కావాల్సి ఉంది. ఈ కార్డు ద్వారా డాక్టర్ వద్దకు వెళ్లిన ప్రతిసారీ రోగి చికిత్స వివరాలు ఆన్‌లైన్లో నమోదవుతూ ఉంటాయి. దీని ద్వారా పాత రిపోర్టులు ఆన్‌లైన్‌లో చూసి మెరుగైన, సత్వర వైద్యం అందించేందుకు వీలవుతుంది.

–హేమలత,
ఆర్‌బీఎస్‌కే జిల్లా కో–ఆర్డినేటర్, కర్నూలు

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు శివారులోని కోడుమూరు రోడ్డులో ఉన్న గురుబ్రహ్మ నగర్‌లో నివాసముంటున్న మనోహర్ (30) నయం కాని జబ్బుతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బేతంచెర్ల పట్టణానికి చెందిన మనోహర్ కొన్నేళ్లుగా కర్నూలులో ఉంటూ కర్నూలు శివారులోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. మొదటి భార్య వదిలేయడంతో బంధువుల అమ్మాయిని రెండో వివాహం చేసుకున్నాడు.కొన్నేళ్లుగా జబ్బుతో బాధ పడుతున్న మనోహర్ నయం కాదని భావించి గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనపై విచారణ జరుపుతున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

కర్నూలు: కర్నూలు శివారులోని సుంకేసుల రోడ్డులో ఉన్న సెయింట్‌జోసెఫ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని (17) కాలేజీ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాలిక తల్లిదండ్రులు కూడా అదే కళాశాలలో ఒకరు ఆయాగా, ఒకరు బస్సుకు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వీరు గీతాముఖర్జీ నగర్‌లో నివాసముంటారు. బాలిక ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ చదువుతోంది. శుక్రవారం స్లిప్‌టెస్టులో భాగంగా కాపీలు కొడుతుండటంతో లెక్చరర్ గమనించి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక భవనం పైనుంచి కిందికి దూకింది. కళాశాల నిర్వాహకులు వెంటనే అప్రమత్తమై బాలికను సమీపంలోని వీఆర్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్సలు చేయించారు. ఎలాంటి తీవ్రమైన గాయాలు కాకపోవడంతో బాలిక పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు కళాశాల నిర్వాహకులు తెలిపారు.



రాకపోక.. నరకయాతన

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చిప్పగిరి మండలం గుమ్మనూరు, డేగులపాల్ గ్రామాల మధ్య రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీరు భారీగా చేరింది. పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ. 8 కోట్లతో అండర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పనులను అర్ధంతరంగా ఆపివేయడంతో ఈ దుస్థితి నెలకొంది. అండర్ బ్రిడ్జి కింద నీరు పోయే మార్గం ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

– చిప్పగిరి

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

- పూజల కోసం ఇంట్లో గుంతలు



మృతిచెందిన పెద్ద రంగన్న

గోనెగండ్ల: మండలంలోని చిన్నమరివీడు గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఆస్పరి మండలం వలగొండ గ్రామానికి చెందిన కురువ పెద్ద రంగన్న భార్య ఈశ్వరమ్మకు కొన్ని నెలలుగా కాళ్ల నొప్పులు ఉండేవి. గోనెగండ్ల మండలం చిన్నమరివీడు గ్రామానికి చెందిన కాశీం స్వామి పూజలు చేసి వ్యాధి నయం చేస్తాడని సమీప బంధువు నాగరాజు చెప్పడంతో వీరు నమ్మారు. చిన్నమరివీడు గ్రామానికి వచ్చి కాశీంస్వామిని కలవగా.. ఆయన ఏడు వారాలు దర్గాకు రావాలని చెప్పాడు. నాలుగు వారాలు తిరిగినా నొప్పులు తగ్గకపోవడంతో కాశీం స్వామి ఇంటి దగ్గరకు వచ్చి పూజలు చేస్తాను కొంత డబ్బు తీసుకున్నాడు. కాశీం స్వామితో బోదేపాడు గ్రామానికి చెందిన ప్రభాకర్, నెల్లిబండ గ్రామానికి చెందిన శివ మరియా నాగరాజులు కలిసి 20వ తేదీ వలగొండ గ్రామానికి వెళ్లి ఈశ్వరమ్మ ఇంట్లో 40 చోట్ల గుంతలు తవ్వి ప్రత్యేక పూజలు చేశారు. 21వ తేదీన సాయంత్రం ఈశ్వరమ్మ భర్త పెద్ద రంగన్నకు గొంతునొప్పి, ఛాతీ నొప్పి ఎక్కువగా వచ్చింది. దీంతో ఈశ్వరమ్మ కాశీంస్వామికి ఫోన్ చేయగా.. భార్యాభర్తలను ఇద్దరిని చిన్నమరివీడు గ్రామానికి రమ్మని చెప్పాడు. దీంతో వారు 22వ తేదీ గురువారం సాయంత్రం చిన్నమరివీడు గ్రామంలోని దస్తగిరయ్యస్వామి దర్గా దగ్గరకు ఆటోలో వచ్చారు. కాశీంస్వామి పరిశీలించి నొప్పి తగ్గుతుంది అని చెప్పాడు. అయితే సాయంత్రం ఏడు గంటల సమయంలో నొప్పి మరింత ఎక్కువై పెద్ద రంగన్న (46) మృతి చెందాడు. తన భర్తది సాధారణ మరణం కాదని ,తనకు అనుమానం ఉందని మృతుని భార్య ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ గంగాధర్ తెలిపారు.

పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. మార్చిలో జరిగిన ఈ పరీక్షలకు రెగ్యులర్ విద్యార్థులు 347 మంది హాజరుకాగా 323 మంది, సప్లిమెంటరీ పరీక్షలకు 73 మంది విద్యార్థులు హాజరుకాగా 56 మంది ఉత్తీర్ణత సాధించినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సముద్రాల వెంకటేష్ తెలిపారు.

కమాండెంట్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రవిశంకర్

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండవ బెటాలియన్ కమాండెంట్‌గా నియమితులైన రవిశంకర్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో కర్నూలులోనే పనిచేసి ఎన్నికల ముందు వైఎస్సార్ జిల్లా బాక్రాపేట 11వ బెటాలియన్‌కు బదిలీపై వెళ్లారు. తర్వాత కమాండెంట్‌గా శ్రీనివాసులు మూడు మాసాల పాటు పనిచేసి పదవీ విరమణ పొందడంతో అడిషనల్ కమాండెంట్‌గా ఉన్న ప్రభుకుమార్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. రాష్ట్రవ్యాప్త బదిలీల్లో భాగంగా ఎనిమిది మంది ఏపీఎస్పీ బెటాలియన్స్ అధికారులకు స్థానచలనం కలిగింది. ఇందులో భాగంగా బాక్రాపేటలో ఉన్న రవిశంకర్ కర్నూలుకు నియమితులయ్యారు. దీంతో ఆయన శుక్రవారం సాయంత్రం బాధ్యతలు చేపటారు. వచ్చే నెల ఈయన పదవీ విరమణ పొందనున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమాండెంట్ ప్రభుకుమార్, అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ఎం బాషా, కేశవరెడ్డి, రవికిరణ్‌తో పాటు ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, పటాలం సిబ్బంది, మినిస్టీరియల్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

పంచాయతీ పాలనపై శిక్షణ ఉపయుక్తం

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎస్‌పీ సింగ్ భాగేల్‌తో సర్టిఫికెట్ అందుకుంటున్న జెడ్పీ చైర్మన్

కర్నూలు (అర్బన్): పంచాయతీ పాలనపై కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉందని జిల్లాపరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అభిప్రాయపడ్డారు. ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గుజరాత్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్ ఆనంద్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం ముగింపు సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. స్థానిక సంస్థల బలోపేతానికి ఆర్థికపరమైన అడ్డంకులను తొలగించుకునేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందనే అంశాలపై శిక్షణలో వివరించారన్నారు. నాయకత్వ లక్షణాలు, నిర్వహణ నైపుణ్యాలను అప్‌గ్రేడ్ చేసుకునేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు చాలా అవసరమన్నారు. ఈ శిక్షణకు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలు, అనుభవాలను వివరించారని తెలిపారు. ముగింపు కార్యక్రమానికి కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎస్‌పీ సింగ్ భాగేల్ హాజరయ్యారని చెప్పారు. ఈ నేపథ్యంలోనే శిక్షణకు హాజరైన వారికి సర్టిఫికెట్లను కూడా అందించారని జెడ్పీ చైర్మన్ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతి చెందిన దావీదు

ఎమ్మిగనూరురూరల్: మోటార్ బైక్‌కు కారు ఢీ కొనటంతో దావీదు(45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఆయన కుమారుడు చరణ్‌కు, మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీ సమీపంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎర్రకోట గ్రామానికి చెందిన దావీదు భార్యాపిల్లలతో పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీలో నివాసముంటున్నాడు. సెంట్రింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాత్రి ఎర్రకోటకు వెళ్తానని చెప్పటంతో తండ్రితో పాటు కుమారుడు చరణ్ బయలుదేరాడు. వీరితోపాటు చరణ్ స్నేహితుడు శ్రీరామ్‌ను కూడా వచ్చాడు. ముగ్గురూ బైక్‌పై వెళ్తుండగా పత్తి జిన్నింగ్ ఫ్యాక్టరీ దగ్గర ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. ప్రమాదంలో దావీదు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, కుమారుడు చరణ్, శ్రీరామ్ గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో గాయపడ్డ చరణ్, శ్రీరామ్‌లను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు ప్రభుత్వాసుపత్రికి చేరుకొని ప్రమాదం విషయాలను అడిగి తెలుసుకున్నారు. దావీదు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్ల నిర్వహణకు అధిక ప్రాధాన్యం

- ఏపీఆర్ఆర్‌పీ సలహాదారులు నరసింహారావు, ప్రభాకర్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సలహాదారులు

కర్నూలు(అర్బన్): గ్రామీణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్లలో నాణ్యతతో పాటు నిర్వహణకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్ట్స్ (ఏపీఆర్ఆర్‌పీ) సలహాదారులు నరసింహారావు, ప్రభాకర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్థానిక పీఆర్ ఎస్ఈ కార్యాలయం విశ్వేశ్వరయ్య భవన్‌లో వర్క్‌షాప్ నిర్వహించారు. అలాగే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రోడ్ల నాణ్యత, నిర్వహణపై వివరించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏపీఆర్ఆర్‌పీ నిధులతో చేపట్టిన పనులను నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.189 కోట్లతో 139 రోడ్ల పనులు, మూడు బ్రిడ్జీల నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఇంజినీర్లు వివరించారు. కార్యక్రమంలో కర్నూలు పీఆర్ ఎస్ఈ రామ్మోహన్, పీఆర్ఐ, పీఐయు ఈఈలు మద్దన్న, రామక్రిష్ణారెడ్డి, డీఈఈలు రవీంద్రారెడ్డి, మల్లికార్జున, లక్ష్మినారాయణ, శిల్పాశ్రీ, రమేష్‌కుమార్‌రెడ్డి, ఏఈఈలు సతీష్‌కుమార్, హనుమంతరెడ్డి, పార్థసారథి, మంజుల, రమణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



కర్నూలు మార్కెట్ ధరలు (క్వింటా రూ..ల్లో

పంట	తక్కువ ధర	ఎక్కువ ధర
వేరుశనగ	3,600	7,046
పొద్దుతిరుగుడు	4,269	4,719
ఆముదం	5,490	5,849
వాము	11,440	15,812
ఉల్లి	1,237	3,934
ఎండుమిర్చి	2,819	5,659
శనగలు	7,019	7,019
కందులు	5,236	9,319
మొక్కజొన్న	2,560	2,560
మినుములు	7,509	8,809
కొర్రలు	2,396	3,229
సోయాచిక్కుడు	2,869	2,869